బయటలేడు. నీహృదయంలోనే ఉన్నాడు ఆ గురువే దేవుడిగా ఉన్నాడు, ఆత్మగాఉన్నాడు, చైతన్యముగా ఉన్నాడు. నీకుదేహబుద్ధి ఉన్నంతకాలం గురువునీకంటే వేరుగా ఉన్నాడు అనిపిస్తుంది. నీలోపల ఉన్న గురువును తెలుసుకొనే వరకూ నీకు బేదబుద్ధి నశించదు, మాయ నశించదు. నీలోపల ఉన్నగురువును తెలుపుకొన్న తరువాత వాడికి నీకుబేధంలేదు అని నీకు తెలుస్తుంది. ఆయనే నేను, నేనే ఆయన ఇద్దరికి తేడాలేదు అన్న సంగతి నీలోపలున్న గరువు నీకు అనుభవంలోనికి వచ్చాక తెలుస్తుంది. ఆబేధబుద్ధి నశించాక నీకు జ్ఞానం కలుగుతుంది. అప్పడు మోక్షసుఖం నీకు అనుభవంలోనికి వస్తుంది.

హృదయంలో ఉన్న సత్యవస్తువును తెలుసుకొనే మార్గం చెప్పండి అనిఅడిగితే నీకు సాత్వికబుద్ధి ఉంటే నీహృదయంలో నుండే నీకు సహాయం అందుతూ ఉంటుంది. ఆమార్గం కనిపిస్తుంది. బయటగురువు చెప్పనక్కరలేదు. హృదయంలో ఉన్నగురువే నీకు దారిచూపిస్తూ ఉంటాడు.సాత్వికబుద్ధి దేవుడుకాదు కానిదేవుని దగ్గరకువెళ్లే మార్గంచూపిస్తుంది. మనం చిన్నచిన్న పనులను అశ్రద్ధచేస్తాము. అందరిదగ్గర డబ్బుఉంటుందా పెద్ద పెద్ద పనులు చేయటానికి. దైనందిన జీవితంలో మనంచేసే చిన్న చిన్న మంచిపనుల వలనకూడా దైవానుగ్రహానికి పాత్రులమవుతాము. అందువలన మనంచేసే ప్రతీచిన్నపనిని శ్రద్ధతో, భక్తితో చేయాలి.

## నర్సాపురంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 27-6-97

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

సామాన్య మానవుడికి కోపం, రాగం, ద్వేషం, అసూయ, భయం ఇవి అన్నీ సహజంగా ఉంటాయి. కాని జ్ఞానికి దయ, స్నేహం, సంతోషం ఇవి అన్నీ సహజంగా ఉంటాయి. జ్ఞానితో స్నేహం అంటే మనస్నేహంలాగ ఉండదు. మనస్నేహాలు దుఃఖాన్ని పుట్టిస్తాయి. జ్ఞానితో స్నేహం ఎటువంటిది అంటే అది సుఖాన్ని, శాంతిని ఇస్తుంది. అనేకమందికి అనేక రకాల సిద్దులు ఉంటాయి. వారికి ఉన్న సిద్ది వలన కొంత మందికి సంపాదన రావచ్చును. రమణమహర్షిలో ఉన్న ప్రత్యేకత ఏమిటి అంటే ఆయనకు ఉన్న సిద్ది అందరికి శాంతిని ఇవ్వటం. భౌతికమైన సిద్ధులకంటే శాంతిని, సుఖాన్ని కలుగజేసే సిద్ది, తత్వాన్ని మీకు అనుభవంలోనికి పట్టి ఇచ్చే సిద్ధి ఉదాత్తమైనది. అటువంటి సిద్ధి భగవాన్‌కు ఉంది. మాట అక్కరలేదు మౌనం నుండే అందరికి శాంతిని, ఆనందమును ఇస్తారు.

ఏదైనా ఒకమాట విన్నా, ఒక పని చేసినా అది నీచైతన్యస్థాయిని పెంచకపోతే దానిని తీసి ఒక ప్రక్కన పెట్టండి. హిందూమతంలో పూజకి ఇచ్చిన విలువ శ్రవణానికి ఇవ్వటంలేదు. శ్రవణం కూడా చాలా గొప్పది. మీ అజ్ఞానమును అందులో కలపకుండా జ్ఞాని చెప్పిన మాటను మనంధ్యానం చేస్తే జ్ఞాని ఏ వస్తువును అయితే పొందాడో ఆవస్తువు మనకు కూడా అనుభవంలోనికి వస్తుంది. మనం మంచి మాటలు వింటాము. ఇంటికి వెళ్లి ఆ మంచిమాటలకు మన అజ్ఞానమును కలుపుతాము. దానికి మననం అని పేరు పెట్టుకొంటాము. అలాకాదు జ్ఞాని చెప్పిన మాటను అందులో నీ అహంకారమును కలపకుండా ధ్యానం చేయాలి.

మానవుడికి దుఃఖానికి కారణం, జన్మలకు కారణం కర్తృత్వమే. కర్తృత్వం ఎక్కడ ఉంది అంటే నీమనస్సులో ఉంది. కర్తృత్వం ఉన్నంతకాలం దేహం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ ప్రతీ జన్మలోనూ దుఃఖం నీకూడా వచ్చి తీరుతుంది. కర్తృత్వం లేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. ఇప్పుడు మనస్సు నీకు నేనుగా ఎలా వ్యక్తమవుతోందో అలాగ నీహృదయంలో ఉన్న వస్తువు నీకు నేనుగా వ్యక్తమయినపుడు నీకు దుఃఖం నశిస్తుంది. జీవుడికి ఎందుకు దుఃఖం వస్తోంది అంటే జీవుడికి కర్తృత్వం ఉంది. ఆత్మకి దుఃఖం లేదు ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వం లేదు. నీవు జీవుడిగా ఉన్నంతకాలం దుఃఖం నిన్ను వెంటాడుతుంది. ఆత్మ నీకు తెలియబడిన వెంటనే ఆత్మలో కర్తృత్వం లేదుకాబట్టి నీకు దుఃఖం నశిస్తుంది. మీకు ధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా వాటివలన మీకు జ్ఞానంరాదు. ధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా మనకు సుఖం, శాంతి లేకపోతే మనం చావును కోరుకొంటాము. ఎందువలన అంటే ధనం వలన, పాండిత్యం వలన దుఃఖం నశించదు. నీహృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నీకు నిజమైన శాంతి, ఆనందం కలుగుతుంది. అప్పటివరకు దుఃఖం తప్పదు. ఇప్పుడు నీకు దుఃఖం లేకపోయినా అది పోయింది అనుకోవద్దు. అది వాయిదా పడుతోంది. ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా అది తప్పక అనుభవించవలసిందే. కర్తృత్వం ఉన్నంతకాలం దుఃఖం తప్పకవచ్చి తీరుతుంది. నీవు చైతన్యస్థాయిని అందుకునే వరకూ నీకు దుఃఖంతప్పదు.

గుణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. గుణాలు బ్రహ్మంలో లేవు. అందరూ నిన్ను మంచివాడు అంటూ ఉంటే నేను మంచివాడిని, నేను మంచివాడిని అని అక్కడ ఆగిపోకు. మంచితనం గమ్యంకాదు. మంచితనం అనేది మనస్సులో ఉంది గాని చైతన్యంలో లేదు. మంచితనం అనేది బ్రహ్మంను తెలుసుకోవటానికి ఒక ఆధారం మాత్రమే. మేము ఏదో ఆధారాలు పెట్టుకొని బ్రతుకుచున్నాము మీరు ఆధారాలను ఊడగొడుతున్నారు అని భగవాన్‌తో అంటే మీ ఆధారాలను ఊడగొట్టటంకాదు మిమ్మలను నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి చెపుతున్నాను అన్నారు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలియకపోతే నీకు స్వేచ్ఛలేదు, శాంతి లేదు. నీవు నడిచి వెళ్ళేటప్పుడు చెప్పలు తొడుక్కో. నీకాలు ముల్లు మీద పడినా, రాయిమీద పడినా నీకు ప్రమాదంలేదు. నీకాలుకు చెప్పలు ఉంటే అవి గ్రుచ్చుకోవు. అదే విధంగా నీవు జ్ఞాన దృష్టిని సంపాదిస్తే నీకు ప్రాపంచిక పరిస్థితులు, సంసార పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా అవి నిన్ను తాకవు. నీ మనస్సు బాహ్యముఖం అవుతూఉంటే ఇవి అన్నీ నీమనస్సును తాకుతాయి గాని నీమనస్సు అంతర్ముఖం అవుతూఉంటే ఈ కష్టాలు ఏమీ నీ మనస్సును తాకవు.

జ్ఞానికి దేహంతో పనిలేదు. వాడు తింటున్నా, నడుస్తున్నా ప్రయాణాలు చేసినా, ఏ పని చేసినా ఇతరుల కోసమే. వాడికి స్వొంతపని అంటూ ఏమీలేదు. జ్ఞాని పని చేస్తాడు. నిర్మలంగా, నిశ్శబ్దంగా, సహజంగా చేసుకొనిపోతాడు. నీ మాటలవలనగాని, చేష్టలవలనగాని, లోక విషయాలకుగాని ఆయన ప్రభావితుడు కాడు. మనం ఆయనను గౌరవించినా, అగౌరవించినా అది ఆయన హృదయం వరకు వెళ్ళదు. మనతోపాటే నవ్వుతూ ఉంటాడు, ఏడుస్తూ ఉంటాడు, పాటలు పాడుతూ ఉంటాడు. గాని ఇందులో ఏదీ ఆయనకాదు. అద్దంలో కనిపించే ప్రతిబింబం ఎంత అసత్యమో ఈలోకంకూడా అంతే అసత్యం అని జ్ఞానికి స్పష్టంగా తెలుస్తూఉంటుంది. ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి

ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని మన తెలివి తేటలతో తొలగించుకోలేము. ఈశ్వరానుగ్రహం అవసరము. ఈశ్వరానుగ్రహం వచ్చినప్పుడు పునర్జన్మ కారణములైన వాసనలు అన్నీ ఆ ప్రవాహములో కొట్టుకొనిపోతాయి. కేవలము మీసాధనవలన వాటిని తొలగించుకోలేరు.

ఏనుగులో, గోవులో, పండితుడిలో, కుక్కలో, కుక్కమాంసం తినేవాడిలో అందరిలోను ఒకే వస్తువును ఎవడైతే చూస్తున్నాడో వాడే జ్ఞాని. ఒకే వస్తువును చూస్తూ ఉంటాడు కాబట్టి వాడికి వికారము కలుగదు, నిర్వికారంగా ఉంటాడు. సమత్వమే జ్ఞాని యొక్క ముఖ్యలక్షణము. జీవలక్షణాలు ఒకలాగ ఉండవు. రకరకాల లక్షణాలు, గుణాలు ఉంటాయి. ఈ రకరకాల జీవలక్షణాల మధ్యన సమత్వంగా ఉండటం నేర్చుకో. నువ్వు యోగివి అవుతావు. భగవంతుడు ఒక చోటుకి పరిమితమైలేడు. అంతటా ఉన్నాడు. నాస్వరూపంలో ఈసృష్టిఅంతా ఒకమూల ఒదిగి, ఒదిగి ఉన్నది అన్నాడు భగవంతుడు. జ్ఞానం శక్తి లేకుండా ఉండదు. జ్ఞానం, శక్తి వేరుకాదు. రెండూ ఒక్కటే. సత్పురుషుల సహవాసం ఎందుకంటే సత్పురుషుల సమక్షంలో కూర్చొన్నప్పుడు ఏదో అనుభవం కలుగుతుంది. అక్కడ నీకు కలిగిన అనుభవం ఆ అనుభవాన్ని సొంతం చేసుకోవటానికి నిన్ను తరుముతుంది. అందువలన సత్పురుషుల సహవాసం అవసరం.

నీహృదయంలో ఉన్నవస్తువు నిర్మలంగా ఉంది, సహజంగా ఉంది. దానిని తెలుసుకోవటానికి ఎవరో ఇతరులు నీకు అడ్డురావటంలేదు. నీమనస్సే అడ్డు వస్తోంది. నీమనస్సు దొంగమేతకు అలవాటు పడింది. దానికి నీ హృదయంలో ఉన్న సుఖాన్ని, శాంతిని కొంత రుచి చూపించు. అప్పుడు నీ మనస్సును కట్టివేయటానికి సాధనలు చేయనక్కరలేదు. తనమూలంలో ఉన్న శాంతి మనస్సుకు ఎప్పుడైతే అందిందో అది ఎక్కడికి కదలదు. దాని మూలంలోనికి వెళ్ళికూరుకొని పోయేవరకు అది ప్రయత్నం చేస్తుంది.

మీరు భౌతికంగాచేసే పనులే యాంత్రికంగా చేయవద్దు. చేసేపని హృదయపూర్వకంగా చేయండి. ప్రేమగా చేయండి. మీకుజ్ఞానం కలుగుతుంది. పూజగదిలో మీరుచేసేపనికాదు మీరు లోకానికి సంబంధించి చేసేపనులే యాంత్రికంగా చేయవద్దు. హృదయపూర్వకంగా చేయండి, ప్రేమగా చేయండి. అలాపనిచేయటంవలన భౌతికంగా లాభంవచ్చినా రాకపోయినా నీహృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ఏవైతే ఆటంకాలు ఉన్నాయో అవి తొలగించబడతాయి. అప్పుడు సహజంగానే జీవుడు వెళ్ళి హృదయంలో ఐక్యమవుతాడు. అక్కడ ఉన్నది శాంతి, ఆనందమే. హృదయానందమును పొందిన తరువాత దేహంపోతూ ఉన్నా నీకు ఏమీ అనిపించదు. పుట్టుక అసహజం, చావు అసహజం, దుఃఖం అసహజం, నేను తెలివైనవాడిని, నేను తెలివితక్కువవాడిని అనుకొంటావు ఇవి అన్నీ అసహజం. ఇదికాదు ఒక సహజమైన వస్తువు నీహృదయంలో ఉంది. నీకోసం ఎదురుచూస్తోంది. గురువు అనుగ్రహం వలన మనస్సు అణిగిపోతే నీలోపల ఉన్న వస్తువు దాని స్వరూపాన్ని నీకు ఇచ్చేస్తుంది.

(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 20-7-97 గురుపౌర్ణిమ)